క్లుప్తంగా

15లోగా ఇంటర్ పాఠ్య పుస్తకాల పంపిణీ

పరవాడ: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని వచ్చే నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారన్నారు. ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలతో పాటు 200 పేజీల 12 నోట్ పుస్తకాలు, బ్యాగును అందజేస్తామన్నారు. కళాశాలలో ఇంటర్ మొదటి ఏడాదిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రవేశాల కోసం ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

వీధిలైట్లు లేక చీకట్లు

పరవాడ : నాయుడుపాలెం శివారు గంగునాయుడుపాలెం గ్రామం సమస్యల వలయంలో చిక్కుకుందని ఉత్తరాంధ్ర జిల్లాల బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణంనాయుడు అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు వేసినప్పటికీ వీధి లైట్లు పునరుద్ధరించలేదన్నారు. ఫలితంగా చీకటి పడితే ఇంటి నుంచి బయటకు రావాలంటే స్థానికులు భయపడుతున్నారన్నారు. గ్రామంలోని అంధకారం తొలగించేందుకు వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

నాడు - నేడు పనుల పరిశీలన



నాడు - నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈవో సూర్యనారాయణమూర్తి

సబ్బవరం: మండలంలో తవ్వవానిపాలెం జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను సబ్బవరం ఎంఈవో బి.సూర్యనారాయణమూర్తి గురువారం పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న కాంపౌండ్ వాల్, అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

'నేను బడికి పోతా' విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మణ్

సబ్బవరం: 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సబ్బవరం ఎంఈవోలు ఎస్.లక్ష్మణ్, బి.సూర్యనారాయణమూర్తి కోరారు. సబ్బవరం ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బడి ఈడు పిల్లలు బడిలో మాత్రమే ఉండాలన్నారు. బడి బయట ఉంటే వెంటనే బడిలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. వచ్చే నెల 12వ తేదీ వరకు నిర్వహించే నేను బడికి పోతా కార్యక్రమంలో బడి బయట ఉన్న పిల్లలు, డ్రాప్ అవుట్లను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వి.లలితకుమారి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌తో ఎమ్మెల్యే పంచకర్ల భేటీ



పెందుర్తి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అమరావతిలోని పవన్ చాంబర్‌లో కలుసుకుని పెందుర్తి నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయనకు వివరించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

డ్రగ్స్ కట్టడికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు



సమావేశంలో సచివాలయాల మహిళా పోలీసులు

- మహిళా పోలీసులు బాధ్యతతో పనిచేయాలి
- లా అండ్ ఆర్డర్ డీసీపీ–2 సత్తిబాబు

సింహాచలం : గంజాయి, డ్రగ్స్ సరఫరా, విక్రయాలు నియంత్రించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని నగర లా అండ్ ఆర్డర్ డీసీపీ – 2 సత్తిబాబు సూచించారు. ఎక్కడైనా విక్రయాలు జరుగుతున్నాయని అనుమానం వస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కి సమాచారమివ్వాలని కోరారు. డ్రగ్స్, గంజాయి నియంత్రణపై వెస్ట్ జోన్ పరిధిలోని గోపాలపట్నం, పెందుర్తి, ఎయిర్‌పోర్టు జోన్, కంచరపాలెం పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న వార్డు, గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో గురువారం సాయంత్రం సింహాచలంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సత్తిబాబు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌కి బానిసలైన యువత ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యావంతులు కూడా మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు కన్నీటిని మిగులుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న వంద రోజుల్లో గంజాయి, డ్రగ్స్ నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని, అందుకు అనుగుణంగా గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులు కూడా తమ వంతు బాధ్యతలు నిర్వర్తించాలన్నారు.

అందరికీ అవగాహన కల్పించాలి

ముఖ్యంగా సచివాలయం పరిధిలో ఉన్న నివాసితులతో మహిళా పోలీసులు పరిచయం పెంచుకోవాలని డీసీపీ సత్తిబాబు సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను తెలియజేయాలన్నారు. స్కూళ్లు, కళాశాలల్లో కూడా విద్యార్థులకు తెలియపరచాలన్నారు. చిన్నచిన్న పాన్‌షాపులలో కూడా డ్రగ్స్, గంజాయి విక్రయిస్తున్నారని, వాటిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సమీప పోలీస్ స్టేషన్ సీఐ లేదా ఎస్‌ఐకి సమాచారం అందించాలన్నారు. సమాజంలో శాంతి భద్రతలు నెలకొల్పడంలో, డ్రగ్స్‌ని అరికట్టడంలో, మహిళల సంరక్షణకు, ఈవ్‌టీజింగ్‌ని అరికట్టేందుకు మహిళా పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఆయా స్టేషన్ల పరిధిలో ఉన్న సీఐలు, ఎస్‌లు కూడా మహిళా పోలీసులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సూచించారు. వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి మాట్లాడుతూ ఉన్నత పౌరులుగా ఎదగాల్సిన యువత మాదక ద్రవ్యాలు, గంజాయి బారిన పడుతున్న పరిస్థితులను అరికట్టేందుకు సచివాలయాల మహిళా పోలీసులు సహకరించాలన్నారు. వారం రోజుల్లోనే మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు సురేష్, రామకృష్ణ, చక్రధర్, గోపాలపట్నం ఎస్‌ఐలు అప్పలనాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ పండగ



దుర్గమాంబను దర్శించుకున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, శ్రీనివాసరావు, పెద్దలు

పరవాడ: గ్రామంలో కొలువుదీరిన దుర్గమాంబ పండగ గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులకు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు చీర, జాకెట్, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి, శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బండారు రామారావు, స్థానిక నాయకులు పైల పోతినాయుడు, పైల గోపాలకృష్ణ, పైల హరీష్, వగ్రి హరి తదితరులు దర్శించుకున్నారు. డప్పు వాయిద్యాలు, చిడతలు, కోయ డ్యాన్స్‌ల నడుమ అమ్మవారిని వీధుల్లో ఊరేగించారు. అనంతరం భారీ బాణసంచా కాల్పుల నడుమ దుర్గమాంబ అనుపు మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో స్వామికి పూజ చేస్తున్న అర్చకుడు, భక్తులు



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

- శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను కల్యాణ మండంలోని వేదికపై అధిష్టింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

తారక్‌నాథ్‌కు ఘన నివాళి

ఇద్దరు అనాథ బాలురలకు సాయం



చిన్నారులకు సాయం అందిస్తున్న పైలా ప్రసాదరావు, తదితరులు

సబ్బవరం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ బ్యాంకు ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు తారక్‌నాథ్ వర్ధంతి కార్యక్రమం గురువారం సబ్బవరం ఎస్‌బీఐ బ్రాంచి వద్ద జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి సబ్బవరం ఎస్‌బీఐ ఉద్యోగుల సంఘం సభ్యులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఇటీవల మండలంలోని పెదగొల్లలపాలెం దళితవాడలో తల్లిదండ్రులు కోల్పోయి అనాథలుగా మిగిలిన ఇద్దరు బాలురలకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మొత్తాన్ని వారి పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్టు సంఘం రీజనల్ సెక్రటరీ పైలా ప్రసాదరావు తెలిపారు. ఇంకెవరైనా దాతలు ముందుకు వచ్చి సాయం అందిస్తే బ్యాంకు ఖాతాలలో జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు మురళీ, కల్యాణ్, రమేష్, నిహార్, శ్రీరాములు, జి.వి.రమేష్, లక్ష్మి, పెంటయ్య, కమలాకర్, చిరంజీవిరాజు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి



సూచనలిస్తున్న ఈస్ట్ ఏసీపీ జయరామ్‌ప్రసాద్



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

- మత్తు పదార్థాల జోలికి పోవద్దు
- యువతకు ఈస్ట్ ఏసీపీ సూచనలు

సీతమ్మధార: చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని ఈస్ట్ ఏసీపీ మెహర్ జయరామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. దొండపర్తిలో గురువారం సైబర్ నేరాలు, మత్తు, మాదక ద్రవ్యాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. విశాఖలో మాదక ద్రవ్యాల నివారణకు 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. డ్రగ్స్ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దీనికి ప్రజల నుంచి సహకారం అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇళ్లు అద్దెకిచ్చిన సమయంలో వారి పూర్తి వివరాలు తీసుకోవాలని, వారు ఏం చేస్తున్నారో పరిశీలించాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయిస్తున్న వారి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. పిల్లలపై తల్లిదండ్రులు కూడా దృష్టి పెట్టాలని సూచించారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరించారు. అపార్ట్‌మెంట్లు, వ్యాపారాలు చేసుకొనే వారు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. తద్వారా దొంగతనాలు, ఇతర నేరాల నియంత్రణకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫోర్త్ టౌన్ సీఐ ఎస్.విజయ్‌కుమార్, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు, ఎస్‌ఐలు వెంకటరావు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలకు సత్కారం



ఎం.వి.వి.సత్యనారాయణ, శైలజ దంపతులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

సీతంపేట: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకుని అంకితభావంతో పనిచేసి సేవా సంస్థలకు తమ వంతు సహకారం అందించాలని రోటరీ క్లబ్ విశాఖ పోర్టు సిటీ అధ్యక్షుడు ఆర్.రామకృష్ణారావు కోరారు. రోటరీ క్లబ్ చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలు, పోలియో వ్యాక్సినేషన్‌కు వాగ్దేవి పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు సుమారు రూ.60 వేలు సాయం అందించారు. క్లబ్‌కు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్న వాగ్దేవి స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్.శైలజలను గురువారం పాఠశాలలో రోటరీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ కార్యదర్శి ఎం.ఎస్.ఎన్.రాజు, సంయుక్త కార్యదర్శి కైలాష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సినీ ప్రముఖులకు సంగీత కళాభిషేకం



నివాళులర్పిస్తున్న కళారంగ ప్రముఖులు

సీతంపేట: విశాఖ రత్న, దాసరి నారాయణరావు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ ప్రముఖులకు సంగీత కళాభిషేకం నిర్వహించారు. సూపర్ స్టార్ కృష్ణ, దాసరి నారాయణరావు, ఎన్టీ రామారావు, రామోజీరావు చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. అనంతరం కళారంగ ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఫొటోగ్రాఫర్ మట్టా లోకేష్‌కుమార్, విశ్రాంత సీఎంవో డి.ఎస్.పట్నాయక్, సినీ నటులు బొబ్బాది, కార్మిక నాయకులు పైడి శంకరరావు, అఖిల భారత ఆర్య వైశ్యుల సంఘం అధ్యక్షులు కొల్లూరి సత్యనారాయణలను సత్కరించారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు మనుపల్ల, మాధురి, శ్రీదేవి, వీరేంద్ర, బి.నాగేశ్వరరావు సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. సంస్థ ప్రతినిధి పి.ఎ.భాస్కరరావు, అతిథులు కుమార్ నాయక్, నాంచారయ్య, శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్‌పై పోలీసుల కొరడా



అక్కయ్యపాలెంలో రాంగ్ పార్కింగ్ వాహనాలకు లాక్‌లు వేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కయ్యపాలెంలో రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు పోలీసులు లాక్ వేసి, జరిమానా విధించారు. అక్కయ్యపాలెంతోపాటు ఇతర ప్రాంతాల్లో రాంగ్ పార్కింగ్ చేసి వారిపై చర్యలు చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు లాక్‌లు వేసారు. రాంగ్ పార్కింగ్ చేస్తే జరిమానాలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. వాహన చోదకులు రోడ్డుకు ఇరువైపులా మార్క్ చేసిన ప్రాంతంలో వాహనాన్ని పార్క్‌చేసుకోవాలని సూచించారు.

మానవాళికి అద్భుత వరం యోగా



మురళీనగర్ బృందావన్ పార్కులో యోగా సాధన చేస్తున్న మహిళలు

మురళీనగర్: నడక ప్రాధాన్యాన్ని తెలుపుతూ ప్రజల్లో ఆరోగ్య స్పృహను కలిగించడమే ధ్యేయంగా మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని వాకర్స్ జిల్లా 101 గవర్నర్ టి.రంగారావు అన్నారు. మురళీనగర్ బృందావన్ పార్కులో క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహణలో మహిళలు చూపుతున్న చొరవ ప్రశంసనీయమన్నారు. లలితారెడ్డి మాట్లాడుతూ పిల్లలు, పెద్దలు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, తాజా ఆహారం, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకుంటే మహిళల్లో వ్యాధినిరోధక శక్తి పెంపొందించుకోవచ్చని సూచించారు. యోగా గురువు శేషామణి మాట్లాడుతూ యోగా మానవాళికి పతంజలి ప్రసాదించిన అద్భుత వరమన్నారు. ఈ సందర్భంగా మహిళలతో యోగాసనాలు వేయించారు. యోగా గురువు శేషామణిని మహిళలు ఘనంగా సత్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ కేబినెట్ సెక్రటరీ సత్యనారాయణ, 101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ ప్రసంగించారు. సేంద్రీయ ఉత్పత్తులతో తయారు చేసిన ఆహారాన్ని హాజరైన సభ్యులకు విజయనగరం జిల్లా జామికి చెందిన కె.శ్యామల స్నాక్స్ అందించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, కోశాధికారి పి.కమల, టి.లీలా నాయుడు, మహాలక్ష్మి పాల్గొన్నారు.

రేపు సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు



రమాసహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 22న పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బుద్ధ మహలక్ష్మీ నగేష్ తెలిపారు. జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ఆ రోజు వేకువ జాము 2 నుంచి 4 గంటల వరకు నిత్యారాధన, బాలభోగం, ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సామూహిక వ్రతాలు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్న సమారాధన, మధ్యాహ్నం 1 గంటకు పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం, చక్రస్నానం, అవబృదం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

దివ్య వార్షికోత్సవంలో భాగంగా..

ఇసుకకొండ సత్యనారాయణ స్వామి దివ్య వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి ఆధ్వర్యంలో వైదికులచే సుదర్శన హోమం, వైదిక సదస్యంలో భాగంగా 25 మంది పండితులకు సత్కారం నిర్వహించారు. అనంతరం మహాదాశీర్వచనం వైభవంగా జరిపారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె. శిరీష పాల్గొన్నారు.

నేడు దోపోత్సవం..

ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దోపోత్సవం (తిరుమంగైయ్యాళ్వార్ కై ంకర్యం) నిర్వహించనున్నట్టు ఈవో బుద్ధ మహలక్ష్మీ నగేష్ తెలిపారు. 22న జ్యేష్ఠ పౌర్ణమి, 23న శ్రీపుష్పయాగం, అనంతరం పవళింపు సేవతో కల్యాణ వేడుకలు ముగుస్తాయని చెప్పారు.

సంపూర్ణ ఆరోగ్యానికి రాజయోగ దోహదం



యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: రాజయోగతోనే సంపూర్ణ మానసిక ఆరోగ్యం సమకూరుతుందని ప్రజాపిత బ్రహ్మకుమారీ సంస్థ హెచ్‌బీ కాలనీ శాఖ రాజయోగ ధ్యానం ఉపాధ్యాయురాలు బీకే రమ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏటా జూన్ 21న ప్రపంచ దేశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుగుతుందని గుర్తు చేశారు. యోగా శాంతికి చిహ్నమన్నారు. ప్రజలంతా యోగ, రాజయోగ సాధన చేయడం ద్వారా సంపూర్ణ మానసిక ఆరోగ్యం పొందాలన్నారు. ప్రపంచంలో గల 140 దేశాల్లో 9,200కు పైగా ఉన్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల్లో ఉచిత రాజ యోగ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నగరంలోని హెచ్‌బీ కాలనీ, వన్‌టౌన్ బురుజుపేట, ఎంవీపీ కాలనీ సెక్టార్–1 నేతాజీ పార్క్, మహారాణిపేట అఫీషియల్ కాలనీ, శాంతిపురం, రైల్వే న్యూకాలనీ వినాయక గుడి, గాజువాక బీసీ రోడ్డు, అగనంపూడి, మల్కాపురం అంబేడ్కర్ కాలనీ ప్రాంతాల్లో గల బ్రహ్మకుమారీస్ శాఖల్లో ఉచిత రాజయోగ శిక్షణ ఇస్తున్నామని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రమ తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మల్కాపురం: ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలని, కనీస వసతులు కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని గాజువాక ఆర్టీసీ డిపో ఎస్‌ఎంయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకరరావు డిమాండ్ చేశారు. కార్మికులను గాజువాక ఆర్టీసీ డిపో మేనేజర్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన డిపో మేనేజర్ వేధింపులకు పాల్పడడం సరికాదని పేర్కొన్నారు. బస్సులు కండీషన్‌లో లేవని, ఇంధనం పొదుపు ఎలా సాధ్యమవుతుందో ఆయనే సమాధానం చెప్పాలన్నారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 7,8వ తేదీల్లో ఎర్ర రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశామని, అయినా యాజమాన్యం స్పందించలేదన్నారు. అందుకే మళ్లీ ప్రింటెడ్ బ్యాడ్జిలతో గురువారం నిరసన వ్యక్తం చేశామన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.